ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 28 ఆగస్టు 2024



సీజనల్ జర్వాల కట్టడికి చర్యలు - కలెక్టర్ 8లో..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం 8లో..



ఫసల్ బీమాపై సందిగ్ధత

- బీమా కంపెనీల కోసం టెండర్లు నిర్వహించని ప్రభుత్వం
- జూలై నెలాఖరుతో పత్తికి ముగిసిన గడువు
- ఈనెలాఖరుతో వరి పంటకు ముగియనున్న వైనం..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రస్తుత సీజన్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలుపై సందిగ్ధత నెలకొన్నది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల వల్ల దెబ్బతినే పంటలకు పరిహారాన్ని అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని అమలు చేసేం దుకు ఆయా కంపెనీల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు టెండర్లు నిర్వహించలేదు. జూలై నెలాఖరుతో పత్తి పంటకు బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగియగా, ఈనెలాఖరుతో వరి పంటకు గడువు ముగియనున్నది. దీంతో ఈ సీజన్‌లో ఆ పథకం అమల్లోకి రావడంపై అనుమానాలు నెలకొన్నాయి.



● జిల్లాలో 2,77,743 ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో ఈ సీజన్‌లో 2,77,743 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కానుండగా, ఇందులో అత్యధికంగా వరి 2,08,814 ఎకరాలు, 57,269 ఎకరాల్లో పత్తి పంట, తదితర పంటలు సాగు చేయన ున్నారని రైతులు అంచనా వేశారు. ఇప్పటివరకు పత్తి 57 వేల ఎకరాలకు పైగా సాగు చేయగా, వరి లక్షా 89 వేల ఎకరాల వరకు సాగు కాగా, కొన్ని చోట్ల ఇంకా వరి నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో 90 శాతం వరకు క్రాప్ బుకింగ్ పూర్తిచేశారు. భారీ వర్షాలు, వడగళ్ల వర్షాలు, అకాల వర్షాలు, కరువు వల్ల, తెగుళ్లు సోకడం వల్ల పంటలను నష్టపోయే రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2016, ఫిబ్రవరి 18న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చింది. ఈ పథకం కింద గతంలో కేంద్ర ప్రభు త్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ప్రీమియం చెల్లిస్తే, రైతు వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. వానాకాలం సీజన్‌లో పంట మొత్తంలో 2 శాతం, యాసంగి సీజన్‌లో 1.5 శాతం ప్రీమియంను బీమా కంపెనీలు వసూలు చేస్తున్నాయి. పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించాల్సి ఉం టుంది. బీమా కంపెనీలను టెండర్ల ద్వారా ఖరారు చేయాల్సి ఉంటుంది. ఆహార పంటలతో పాటు వాణిజ్య పంటలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తుంటారు. రాష్ట్రంలో ఫసల్ బీమా పథకాన్ని వానా కాలంలో 5 పంటలు వరి, పత్తి, కంది, మొక్కజొన్న, వేరుశెనగ పంటలకు, యాసంగిలో 5 పంటలు వరి, పప్పుదినుసులు, మొక్క జొన్న, వేరుశెనగ, మిను ములు, జొన్న పంట లకు వర్తింప జేశారు.

నాలుగేళ్లుగా అమలు కాని వైనం..

రాష్ట్రంలో 2020 నుంచి ఫసల్ బీమా పథకం అమలు నుంచి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుకున్నది. ఈ పథకంలో పలు చేర్పులు, మార్పులు చేయాలని సూచించింది. రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే సమయంలో ఆ రుణం నుంచే బ్యాంకర్లు రైతు చెల్లించే బీమా ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకునే విధానాన్ని ఎత్తివేయాలని నాటి ప్రభుత్వం పేర్కొంది. పంటల బీమా పథకంలో చేరడం, చేరకపోవడం అనేది రైతు ఇష్టంగా ఉండాలని పేర్కొంది. ఆ తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వం పంటల బీమా పథకంలో పలు మార్పులు తీసుకవచ్చింది. బీమా చేయడం నిర్బంధం కాకుండా, రైతులకు ఇష్టం ఉంటేనే చేరే విధంగా నిబంధనలను మార్చారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఆ పథకంలో చేరలేదు. దీంతో రైతులు నేరుగా పంటల బీమా పథకంలో చేరితే 60 శాతం ప్రీమియం చెల్లించాల్సి రావడంతో, అది భారంగా భావించిన రైతులు ఆ పథకంలో చేరలేదు. నాటి ప్రభుత్వం ఫసల్ బీమా పథకం నుంచి చేతులెత్తేయడంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల చాలా వరకు నష్టపోయారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఫసల్ బీమా పథకాన్ని వానాకాలం సీజన్ నుంచి అమలుచేస్తామని, రైతుల మీద భారం వేయకుండా బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి అంచనా విస్తీర్ణం 95 శాతం పూర్తయ్యింది. కొన్ని పంటలకు జూలై నెలాఖరు వరకు చెల్లించే ప్రీమియం గడువు కూడా ముగిసింది. బీమా కంపెనీల ఎంపిక కూడా ఇప్పటి వరకు జరగకపోవడంతో ఈ సీజన్‌లో పంటల బీమా పథకం అమలు చేస్తారా, లేదా అనే విషయమై రైతుల్లో సందిగ్ధత నెలకొన్నది.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27: ఆశా వర్కర్లను వయోజన బీసీజీ సర్వే అప్పగించవద్దంటూ మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జీ జ్యోతి మాట్లాడుతూ గతంలో అనేక సర్వేలు నిర్వహించిన సందర్భంగా పనికి తగిన పారితోషకం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అవి ఇవ్వక పోగా మళ్లీ ఇప్పుడు వయోజన బీసీజీ సర్వే చేయాలని ఆశాలపై పనిభారం మోపుతోందని పారితోషకం ఇస్తేనే బీసీజీ సర్వే నిర్వహిస్తామన్నారు. ఆశా వర్కర్లు చెప్పినప్పటికీ అధికారులు ఆశాలను సర్వే చేయాల్సిందేనని వేధిస్తున్నారని ఇది సరైనది కాదన్నారు. ఈ వేధింపులు ఇలాగే కొనసాగితే ఆశా వర్కర్లు మిగతా విధులు కూడా బహిష్కరిస్తారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు రమాదేవి జ్యోతి, రేణుక, స్వరూప, రాజేశ్వరి, కృష్ణవేణి, స్వప్న, లత, ఆశా వర్కర్లు సీఐటీయూ నాయకుడు ఎస్ వెంకట్‌స్వామి పాల్గొన్నారు.

రైతులకు ఆంక్షలు లేని రుణమాఫీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27 : రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఏలాంటి ఆంక్షలు లేకుండా నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీకి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అని గొప్పలు చెబుతున్నటువంటి పార్టీలు అధికారంలోకి రాగానే వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతు రుణమాఫీలో రేషన్ కార్డు పేరుతో, కుటుంబ సర్వేల పేరుతో మాఫీ చేయడంలేదని వివరించారు. 2 లక్షలకు పైన ఉన్నటువంటి వాటిని కూడా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం స్వామి, రేణుకుంట్ల ప్రీతం, కల్లెపెల్లి నవీన్, గొడిసెల ప్రణీత్, పెరక అశోక్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలి

- రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

అంతర్గాం, ఆగస్టు 27: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులు సహకరించాలని రామగుండం సీఐ టీ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి పంచాయతీ పరిధిలోగల అక్బర్‌నగర్‌లో ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ముందుగా అక్బర్‌నగర్‌లోని ఇళ్లలో సోదాలు నిర్వహించి పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100 డయల్‌కు కాల్ చేసి పోలీసుల సేవలు పొందాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ గమనించాలని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బీ వెంకటస్వామి, సమ్మయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్ డిపోల ఎదుట ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న యూనియన్ల నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 27: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం గోదావరిఖని బస్ డిపో ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎంయూ నాయకులు వంగర శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు విలీనం చేయలేదని, సంస్థలోపని చేస్తున్న ఉద్యోగులపై అధిక భారం పడుతుందని, ఇప్పటివరకు కొత్త నియామకాలు జరుపడం లేదన్నారు. ఒక్కొక్క బస్సులో వందకు మించి ప్రయణికులు ఎక్కడం వల్ల డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త బస్సులు కొనుగోలు చేసి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి టికెట్స్‌ను రద్దుచేసి వాటి స్థానంలో స్మార్ట్ కార్డ్స్ ఇవ్వాలని, బాండ్ల డబ్బులను తక్షణమే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈయూ, ఎన్‌ఎంయూ నాయకులు తిరుపతి, కొమురయ్య పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని, ఆగస్టు 27: టీఎస్ ఆర్టీసీ సంస్థలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంథని బస్సు డిపోలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో పేస్కేల్, బాండ్ పైసలు ఇప్పించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డిపో సెక్రెటరీ వీ. ఐలయ్య, కేకే. రెడ్డి, ఈకేఎం రావు, జనార్ధన్, మహేందర్, కవిత, ఏసుమణి, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ధర్మారం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 9,886 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నంది పంప్‌హౌస్‌లోని 3మోటార్ల ద్వారా గాయత్రి పంప్ హౌస్‌కు, అక్కడినుంచి మిడ్‌మానేరుకు 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీ, హైదరాబాద్, జిల్లా తాగునీటి అవసరాలకు 452 క్యూసెక్కుల నీటిని తర లిస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లో 9,852 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.785 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రేపు మల్లన్న ఆలయంలో లక్ష బిల్వార్చన

ఓదెల, ఆగస్టు 27 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి సదయ్య తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులు ఉదయం 9 గంటలకు ముందే ఆలయానికి చేరుకోవాలని ఈవో కోరారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని రాఘవపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఉప్పు ఉమ కూతురు సాహిత్య వివాహానికి ఏగోలపు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఏగోలపు సదయ్యగౌడ్ బియ్యం, పెళ్లి చీరను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య, తాడిశెట్టి సారయ్య, కుమార్, జనగామ సదయ్య, రమేష్, సాయిరాం, వెంకటేష్, ఫారుఖ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో పండుగలు జరుపుకోవాలి

- అసత్య ప్రచారాలు నమ్మవద్దు - గణపతి మండపాలకు అనుమతి తప్పనిసరి - పోలీస్ కమిషనర్ శ్రీనివాస్





సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, హాజరైన అధికారులు, వివిధ మతాల ప్రతినిధులు

కోల్‌సిటీ,ఆగస్టు 27: ప్రజలు సోదరభావంతో మత సామరస్యాన్ని కాపాడుతూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కమిషరేట్ హెడ్ క్వార్టర్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన మత పెద్దలతో శాంతి సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ చతుర్థి, మిలాద్ ఉన్ నబీ పండుగలు శాంతియత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. రామగుండంకమిషరేట్ ప్రాంత ప్రజలు మత సామరస్యానికి ప్రతీక అని, ఈ పేరును ఇలాగే కాపాడుకోవాలన్నారు. పండుల నిర్వహణలో, శాంతి భద్రతల విషయంలో ఉత్సవాల నిర్వాహకులు యూనిఫాంలేని పోలీసుల్లాగా సేవలందించాలన్నారు. కమిషనరేట్‌పరిధిలో ప్రతి సంవత్సరం 4,253 గణపతి మండపాలు ఏర్పాటుచేశారని, అందులో పెద్దపల్లి జిల్లాలోనే 1981 ఉన్నాయన్నారు. మండపాల నిర్వాహకులు సంబంధిత పోలీస్ స్టేషన్ల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. నిమజ్జన సమయంలో శోభయాత్రలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షణ చేస్తామని ఆయన సూచించారు. మండలపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎప్పుడూ ఇద్దరు తప్పనిసరిగా ఉండాలన్నారు. పాయింట్ బుక్ ఏర్పాటు చేస్తామన, బ్లూ క్లోడ్స్, పెట్రో కార్ వారు చెక్ చేస్తారన్నారు. విద్యుత్‌శాఖ అనుమతిలేకుండా మండపాలకు అక్రమ కనెక్షన్లు తీసుకోవద్దని ఆయన సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్యప్రచారాలు, పుకార్లు నమ్మవద్దన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే కమిషరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 8712656597లో సంప్రదించాలన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, కమిషనరేట్ పరిధిలోని వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల మొదటి దశ పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల మొదటి దశ ధ్రువీకరణ ప్రక్రియ సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూ క్రమబద్ధీకరణ 2020 కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మొదటి దశ ధ్రువీకరణ ప్రక్రియ సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూ క్రమబద్ధీకరణ దరఖాస్తులను మొదటి దశలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఆశా లత, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యం పెంపునకు కార్యాచరణ అమలు చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యం పెంపునకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు, నిర్వహించిన వర్క్‌షాప్ పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, హిందీ వంటి భాషలు, గణితంలోని ప్రాథమిక సామర్థ్యాలు అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా భాషలలో రాయడం చదవడం లెక్కలు చేయడం ఇలాంటి కనీస సామర్థ్యాలు వారి తరగతి అనుకూలంగా చేకూరాలని, వీటి కోసం ప్రతి మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్‌గా ఎంపిక చేసి శిక్షణ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి పాఠశాలలో బహుళ తరగతి బహుళ స్థాయి విద్యా బోధనను ఉపాధ్యాయులు అలవర్చుకోవాలని, పాఠశాలల్లోనే పాఠ్యాంశాలను ప్రణాళిక ప్రకారం విద్యబోధన చేస్తూ విద్యార్థులలో చదువుపై ఆసక్తి కలిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 30, 31వ తేదీలలో నిర్వహించే కాంప్లెక్స్ శిక్షణ సమావేశాల్లో ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాల పెంపు కోసం పాటించాల్సిన విధివిధానాలపై అవసరమైన శిక్షణను అందించాలన్నారు. ప్రతినెలా కాంప్లెక్స్ వారీగా పురోగతిని సమీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా అకడమిక్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని ఆపెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు భక్తులు 56 రకాల పిండి పదార్థాలతో తయారు చేసిన నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు భోజన ప్రసాదం వితరణ చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణతో అలంకరణతో వచ్చిన వారు ఆలయంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరింపిచేశాయి. అనంతరం సోమవారం అర్ధరాత్రి వరకు భక్తులు హరినామ సంకీర్తనలతో భజన కార్యక్రమంలో భక్తి పారవశ్యంతో ఆనందంగా గడిపారు. నాయకులు, ఇస్కాన్ నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దాపూర్ ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ


జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల కోసం వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో గిడ్డంగులు నిర్మించారని దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో నాలుగు దశాబ్దాల క్రితం సుమారు 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగులు నిర్మించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా చేపట్టే పీడీఎస్ బియ్యంతో పాటు, ఫర్టిలైజర్స్, నూనె ఉత్పత్తులు, విత్తనాలు, నిల్వ చేపడుతుండడంతో సుమారు పది మందికి పైగా గోదాముల్లో నిల్వ చేసే ఉత్పత్తులను స్థానిక కార్మికులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ ఉపాధి పొందుతు న్నారన్నారు. గత ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాల నిర్వహణకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంలను కేటాయించడంతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు ప్రైవేట్ గోదాములపై ఆధారపడవల్సి వస్తుందన్నారు. గిడ్డంగుల నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.



11 కేవీ విద్యుత్ లైన్ పనులు అడ్డుకున్న గ్రామస్థులు

శంకరపట్నం, ఆగస్టు 27: మండలంలోని కన్నాపూర్‌లో ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వేయవద్దని విద్యుత్ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. అర్కండ్ల శివారులో రైస్‌మిల్ నిర్మిస్తున్నారు. కన్నాపూర్ సబ్‌స్టేషన్ నుంచి రైస్‌మిల్‌కు విద్యుత్ అందించేందుకు పనులు ప్రారంభించారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామస్థులు పనులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తాడికల్ ఏఈ సంపత్‌రెడ్డి అక్కడకు చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వేరే ప్రాంతం నుంచి వేసుకోవాలని వారు ఏఈకి సూచించారు. గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయని, విద్యుత్ స్తంభాల కోసం గుంత తీస్తే అవి పగిలిపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు ఏఈ సంపత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.


ఏఈతో మాట్లాడుతున్న గ్రామస్థులు

















ఆలయంలో చోరీ

వీర్నపల్లి, ఆగస్టు 27 : వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలోని జగదాంబ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగలగొట్టి డబ్బులను ఎత్తు కెళ్లారు. స్టేషన్ హౌస్ ఇన్ చార్జి బాబు కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం ఆలయం వద్ద హుండీ తాళాలు పగలగొట్టి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకొని హుండీతో పాటు పరిసరాల ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్స్‌లో మద్యం..

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గల శ్రీ లక్ష్మీనర్సింహ వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ తాళం పగుల గొట్టిన దొంగలు లోనికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదు, మరో రూ. 10 వేల మద్యం ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వైన్స్ తెరిచేందుకు నిర్వాహకులు వచ్చి చూడగానే తాళం పగులగొట్టి కౌంటర్ తెరిచి ఉండడంతో ఆందోళన చెందారు. ఈ సంఘటనపై వైన్స్ యజమాని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేత రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వేముల సాయికృష్ణను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 26న మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి అమ్ముతూ సాయికృష్ణ పట్టుబడ్డాడని చెప్పారు. వేములవాడ పట్టణంలోని కొందరు వ్యక్తుల వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణాలతో పాటు పరిసర గ్రామాలకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

కత్తెరతో దాడి కేసులో ముగ్గురికి జరిమానా

జ్యోతినగర్, ఆగస్టు 27: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపల్లి గ్రామంలో చింతపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కత్తెరతో దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జరిమానా విధిస్తూ గోదావరిఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి శ్రీనివాసులు తీర్పునిచ్చారు. 30 అక్టోబరు 2019లో ఖాజీపల్లి గ్రామంలో చింతల లింగయ్య, చింతల కొమురయ్య, చింతల సాయితేజ అనే ముగ్గురు ఒక భూ వివాదంలో శ్రీనివాస్‌పై కత్తెరతో దాడి చేశారు. అప్పటి ఎన్టీపీసీ ఎస్‌ఐ శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ సాక్షులను కోర్టులో అడిషనల్ ప్రాసిక్యూటర్ ఆకుల రాములు సమక్షంలో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలు విన్న తరువాత ముగ్గురు నిందితులను దోషులుగా జడ్జి నిర్ధారిస్తూ చింతల లింగయ్యకు ఆరు వేలు, చింతల కొమురయ్య పది వేలు, సాయితేజకు ఆరు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో ఆరునెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

వైపని కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో జక్కని సతీష్(29) అనే వైపని కార్మికుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన జక్కని సతీష్ వైపని కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఒక సోదరి ఉంది. మంగళవారం ఉదయం బయటకు వెళ్లి టిఫిన్ చేసి ఇంటికి వచ్చిన సతీష్ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. నిద్రపోయాడని భావించిన పక్క గదిలో ఉంటున్న అతని సోదరి బీడీలు ఇచ్చేందుకు కంపెనీకి వెళ్లి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలైనా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సోదరి తమ్ముడిని ఎంత పిలిచినా స్పందించకపోవడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నిస్తే ఎంతకు రాకపోవడంతో పైకప్పు పెంకులు ఊడదీసి చూసే సరికి సతీష్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తొలగించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వస్త్రపరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక పోవడం, ఒంటరి జీవితాన్ని భరించలేక మద్యానికి అలవాటుపడి మనస్థాపం చెంది తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోదరి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 27: మండలంలోని మల్యాల గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతం నుంచి ప్రశాంత్ అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజకుమార్


గాయపడ్డ అనూష్

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పెగడపల్లి, ఆగస్టు 27 : పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో మంగళవారం వీధి కుక్కల దాడిలో పదకొండు చిన్నారి తీవ్రగాయాల పాలు కాగా జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మడిగెల నరేష్, శిరీష దంపతుల కుమారుడు బాబు అనూష్ (11నెలలు) ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. దీంతో బాబు నుదుటి మీద తీవ్ర గాయమైంది. అప్రమత్తమైన బాబు తల్లిదండ్రులు బాబును రక్షించి వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	24,014	4,459	80.5	58.709
ఎల్లంపల్లి	9,886	9,852	20.175	17.785
మిడ్ మానేరు	10,500	14,600	27.54	18.19
ఎల్ఎండీ	14,824	224	24.034	8.37

వివాహిత కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

- ఇద్దరు పరార్
- అరెస్ట్ అయినవారిలో మాజీ నక్సలైట్ దంపతులు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: జిల్లాలోని రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన జక్కుల ధరణి అనే వివాహిత కిడ్నాప్‌నకు పాల్పడిన కేసులో ఆరుగురు కిడ్నాపర్లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివాహిత కిడ్నాప్ వివరాలను ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన ధరణిని బోయిన్‌పల్లి మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కమటం కృష్ణవంశీ ప్రేమించుకొని 2022లో పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి ఇష్టం లేనందున ఎలాగైనా తమ కూతురి మనసు మార్చి మరో పెళ్లి చేయాలని భావించిన కుటుంబ సభ్యులు ప్రస్తుతం కామారెడ్డిలో ఉంటున్న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ నక్సలైట్ గొట్టె మనోహర్, అతని భార్య పద్మలను కలిసి చెప్పారు.

ఇందుకు మాజీ నక్సలైట్ మనోహర్ దంపతులు రూ.5 లక్షలు ఇస్తే పరిష్కరిస్తామని ఒప్పందంచేసుకొని ధరణిని కిడ్నాప్ చేయడానికి ఒక ఏడాది నుంచి ప్రణాళిక వేసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రాము, వేములవాడకు చెందిన ఎక్కల దేవి బాలకిషన్, టిల్లు జగదీష్‌ల సహాయంతో పథకం వేసుకొని ఓ కారు అద్దెకు తీసుకొని ఈ నెల 22న బూరుగుపల్లిలోని అత్తగారింటి నుంచి వివాహిత ధరణిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ సమయంలో ఆమె ఆడపడుచు ఆపేందుకు ప్రయత్నం చేసినప్పటికీ వారి కళ్లల్లో పెప్పర్ స్ప్రే కొట్టి ధరణిని కిడ్నాప్‌చేసి కామారెడ్డి నుంచి నిజామాబాద్ జిల్లా లోని చుండూరు గ్రామం నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ వైపు తీసుకెళ్లి ఆమె మనసు మార్చేందుకు ప్రయత్నం చేశారు. ఈ కిడ్నాప్ సంఘటనపై వెంటనే ఆమె భర్త బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కిడ్నాపర్‌లు ధరణిని తిరిగి బూరుగుపల్లిలో విడిచి పెట్టారు. ఈ మేరకు రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన జక్కు


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

లక్ష్మి, జక్కు రాజశేఖర్, చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రమేశ్, కోనరావుపేటకు చెందిన గొట్టె మనోహర్, గొట్టె పద్మ, కోనరావుపేట మండలంలోని మలక్‌పేటకు చెందిన ఎక్కల దేవి బాలకృష్ణలను వేములవాడ, బాలనగర్ ప్రాంతాల్లో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.

మిగతా టిల్లు, జగదీష్‌లు పరారీలో ఉన్నారని వీరిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. కోనరావు పేట మండల కేంద్రానికి చెందిన గొట్టె మనోహర్ అనే మాజీ నక్సలైట్ అతని భార్య పద్మలు కామారెడ్డిలో ఉంటూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని చెబుతూ అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని వీరిపై సిరిసిల్ల, కామారెడ్డి, జగిత్యాల జిల్లాలోని పలు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. వీరికి సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, మాజీ నక్సలైట్ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వారి సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జానపద కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 27: ఉమ్మడి జిల్లాలోని 60 సంవత్సరాలు నిండిన జానపద, సంచార జాతుల కళారూపాల కళాకారులు పేర్ల నమోదు, పింఛన్ల కోసం పేర్ల నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ జన, జానపద వృత్తి కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్, కార్యదర్శి ప్రకాశ్, ఉప కార్యదర్శి కనకం రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

డప్పులు, కోలాటం (మహిళలు, పురుషులు) కళాకారులు వారి సంస్థ, వ్యక్తిగత పేరు, సంస్థ కళాకారుని సంఖ్య పంపాలని పేర్కొన్నారు. దుబ్బచిందు యక్షగానం, చిరుతల రామాయణం, జడకోలాటం, వీరనాట్యం, కడ్డీ వాయిద్యం, చిరుతల, చెక్క భజనలు, కాటిపాపలు, బ్యాండ్, సన్నాయి మేళా లు, తాటిపాములవారు, సాధనాశూరులు, బుడగ జంగాలు, పాండవుల కథ, వీరభ్రభలు, గొల్ల సుద్దులు, గుస్సాడి, కొమ్ము కోయ, ఒగ్గుకథ, బైండ్ల పోతు రాజులు, బోనాలు, బోనాల కోలాటం, పులివేషాలు, చెంచులు, రాజన్న డోలు, తోలు డప్పులు, నగారా, బుడుబుక్కలవారు, గంగిరెద్దులు, మొండి బండ, దాసరి, వంశరాజులు, పిచ్చగుంట్లవారు, కిన్నెర, జోగి, బాలసంతులు, బహురూపులు, మంద హెచ్చు, తెరచీరలు, అద్దం పటం, కొర్ర రాజులు, రుంజ, బుర్రవీణ, శారద గాండ్లు, గడజట్టి తదిర కళారూపాలకు చెందిన కళాకారులు పోస్టల్ లేదా కొరియర్ ద్వారా దరఖాస్తులను సెప్టెంబరు 10వ తేదీలోగా జి కృపాదానం, 7/49/2/2/2, రేకుర్తి, కొత్తపల్లి మండలం, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని సూచించారు. మిగతా వివరాలకు 810600 6238 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆవులను తరలిస్తున్న లారీ పట్టివేత

ఊపిరి ఆడక ఆరు మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 27: అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ లారీని తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం గోరెగావ్ నుంచి హైదారాబాద్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు.

ఈ క్రమంలో ఎంహెచ్ 34 బీజీ 8497 నంబర్ లారీని తనిఖీ చేయగా అందులో ఆవులు కనిపించాయి. వాటిని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి లారీని స్వాధీనం చేసుకుని ఆవులను ఎల్ఎండీలోని గోశాలకు తరలించారు. లారీలో 48 ఆవులు ఉండగా ఊపిరి ఆడక ఆరు వాహనంలోనే మృతి చెందాయి. చాలా ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. పోలీసులు పశు వైద్యశాఖ సిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. చనిపోయిన ఆవులకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇమ్రాన్, సోహైల్, షాహిద్, తుకారాం, లారీ డ్రైవర్ ఫయాజ్‌అలీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.



ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్య శాఖ సిబ్బంది, లారీలో ఊపిరి ఆడక మృతి చెందిన ఆవులు

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్



గోదావరిఖని, ఆగస్టు 27: బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్‌ను దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా నియమించారు. ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్యా ఈ నియామకం చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్‌ను వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా ఎస్ కుమార్ మాట్లాడుతూ 75 లక్షల మంది దళిత సామాజిక వర్గాన్ని సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించడంతో పాటు దళితులకు బీజేపీ దగ్గర కావాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోదీ దళిత సామాజిక వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని, బీజేపీ దేశంలో, సిద్ధాంతం, నిబద్ధతతో పని చేస్తోందని, దళిత యువతీ యువకులను పార్టీలో చేర్పించాలని హైకమాండ్ ఆదేశించినట్లు చెప్పారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి


ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఆగస్టు 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

చెక్‌పోస్టు వద్ద వాహన రుసుము వసూలు

కొండపైకి అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనాలు పోలీస్ చెక్‌పోస్టు నుంచి కొండ పైకి వెళ్లడానికి దేవస్థానం అధికారులు రూ.50 వసూలు చేశారు. దీనిపై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్లు ఇస్తూ వాహనాల రుసుము వసూలు చేయడం ఇదే మొదటి సారి అని ఇలా చేయడం ఏంటనీ ప్రశ్నించారు. దేవస్థానానికి ఆదాయం పెంచుకోవడానికి అనేక మార్గాలు ఉండగా వాటిపై దృష్టి సారించని అధికారులు వాహనాలు వెళ్లడానికి రుసుము వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వాసికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

గంభీరావుపేట ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబరులో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులను అందించే కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లా తిరుమాలయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌లను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. దమ్మన్నపేట పాఠశాలలో పని చేస్తున్న సంపత్‌కుమార్ సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచి కలిగించడమే కాకుండా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఇన్నోవేటర్ల అవార్డులను స్వీకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


జాతీయ సదస్సులో తాడూరి సంపత్‌కుమార్ ఇన్నోవేటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి (ఫైల్)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంపత్‌కుమార్ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా పనిచేస్తూ గ్రామీణ విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నారు. 2022 సంవత్సరంలో దమ్మన్నపేట జడ్పీ పాఠశాలకు సైన్స్ ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. పెద్దపల్లి జిల్లా చందనాపూర్‌తో పాటు దమ్మన్నపేటలో పనిచేస్తున్న క్రమంలోనూ ఇన్నోవేటర్ల అవార్డులను అందుకున్నారు. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులు ఇన్నోవేటర్ల తయారీలో ప్రతిభను కనబర్చారు.

ఇందులో 16 మంది జాతీయ స్థాయిలో, 8 మంది అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు. పోలెండ్, జపాన్, దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నలుగురు విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. 2018 నుంచి 2023 వరకు వరుసగా జాతీయ స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడంతో పాటు తన మార్గనిర్దేశనంలో విద్యార్థులు పలు అవార్డులను అందుకున్నారు. పది మంది విద్యార్థులు ఇంటింటా ఇన్నోవేటర్ల పోటీలో ఐదు అవార్డులను అందుకున్నారు. సంపత్ కుమార్ ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాల్లో 6, 7, 8 తరగతులకు సంబంధించి పాఠ్యాంశాల విభాగంలోనూ ఉన్నారు. టీ శాట్ ద్వారా ఉపాధ్యాయులు, టీచర్లకు డిజిటల్ బోధన అందిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా తాను పదవీ విరమణ పొందే వరకు వంద ఇన్నోవేటర్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంపత్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే 53 ఇన్నోవేటర్లను అందించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ, ఇన్‌స్పైర్ అవార్డులను విద్యార్థులు అందుకునే విధంగా చేయడం ఆనందంగా ఉందన్నారు. బంజారా భాషలోకి సైన్స్ పాఠాలను అనువదించి మాతృభాషలో వారికి పాఠాలను కూడా బోధించినట్లు తెలిపారు.

హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం

పెద్దపల్లి మార్కెట్‌లో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేసి రిటైలర్ల నిరసన

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27 : పెద్దపల్లి మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో హోల్‌సేల్ వ్యాపారుల తీరును నిరసిస్తూ మంగళవారం రిటైల్ వ్యాపారులు ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారు. దీంతో కూరగాయల కోసం ప్రజలు ఎగబడ్డారు. మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు 30 మంది, రిటెయిల్ వ్యాపారులు 100 మందికి పైగా ఉన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారుల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఉదయం 8 గంటల వరకే విక్రయించాల్సి ఉండగా, పొద్దంతా హోల్‌సేల్ ధరలకే కూరగాయలను విక్రయిస్తుండడంతో రిటైల్ వ్యాపారులు నష్టపోతున్నారు. దీనిని నిరసిస్తూ సోమవారం రిటైల్ వ్యాపారులు కూరగాయల మార్కెట్‌ను బంద్ చేశారు.


పెద్దపల్లి మార్కెట్‌లో కూరగాయల కోసం ఎగబడుతున్న జనం

మంగళవారం కూడా మార్కెట్‌ను బంద్ చేసి సుమారు 30 వేల రూపాయల విలు వైన కూరగాయలను కుప్పలుగా పోసి ఉచితంగా పంపిణీ చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. ఉదయం 8 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టగా రెండు గంటల్లో కూరగాయలన్నీ అయిపోయాయి. వివాదం విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడారు. హోల్‌సేల్ వ్యాపారులు ఉదయం 9:30 గంటల వరకు విక్రయాలు జరుపుకోవాలని, రిటైల్ అమ్మకాలు చేయవద్దని, 5 కిలోలకు తక్కువ గాకుండా మాత్రమే విక్రయించాలని ఒప్పందం కుదర్చడంతో వివాదం సద్దుమణిగింది.

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని ఇంటికి అక్రమంగా విద్యుత్

- కనెక్షన్ తొలగించిన అధికారులు

వేములవాడ, ఆగస్టు 27: భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు, వేములవాడ మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికా రులు గుర్తించారు. కొన్ని సంవత్సరాలుగా చెన్నమ నేని రమేష్ నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి మున్సిపల్, సెస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చెన్నమనేని రమేష్‌బాబు నివాసమైన సంగీత నిలయం (జర్మనీ గెస్ట్‌హౌస్) లోని పలు బల్బులకు మున్సిపల్ స్ట్రీట్ లైట్స్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చి నట్లుగా గుర్తించి తొలగించారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో పలు వురు కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ లైన్ నుంచి అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించామని, అక్రమంగా విద్యుత్ వినియోగించిన బిల్లుకు సంబంధించిన సొమ్మును రికవరీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు పొందిన మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రాజేశ్వరరావు కుమారుడైన చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లు తేలడం స్థానికంగా చర్చనీయాంశమైంది.


చెన్నమనేని నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

పెద్దబొంకూరులో కుక్కల బెడద

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని పెద్దబొంకూరులో కుక్కల బెడద అధికంగా ఉంది. కొన్ని రోజులుగా పశువులపై పిచ్చికుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. పశువులను పొలం వద్ద కట్టేస్తే గుంపులుగుంపులుగా కుక్కలు చేరి తీవ్రంగా గాయపరుస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. రైతులు, వ్యవసాయ పనులకు వెళ్లే మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దాడులను చూసి జంకుతున్నారు. కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్ తాటిచెట్టుపై నుంచి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వృత్తిరీత్యా సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి పోవడంతో కింద పడి గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. వృత్తిపై ఆధారపడ్డ గీత కార్మికుడు శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

ఆర్థిక సాయం అందజేత

ఓదెల, ఆగస్టు 27 : మండల కేంద్రానికి చెందిన గోపతి మొండెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో మృతురాలి కుమారులైన గోపతి రమేష్, అరుణ్ కుమారులకు రూ, ఐదువేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపతి ఎల్లయ్య, ముద్దసాని కుమారస్వామి, బోడకుంట స్వామి, తీర్థాల వీరయ్య, అప్పని తిరుపతి, బుద్దె పోశెట్టి, బోడకుంట నరేష్, అల్లం సతీష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

ఓదెల, ఆగస్టు 27 : మండలంలోని మడక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజుల శివ ఆధ్వర్యంలో ఒకటి నుంచి ఏడవ తరగతి విద్యార్థులకు 70 బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాజయ్య, ప్రధానోపాధ్యాయుడు అశోక్, విద్యా కమిటీ చైర్మన్ సరూప, గ్రామపంచాయతీ సెక్రటరీ జ్యోతి, నోముల ఇంద్రారెడ్డి, గొర్ల కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ ఆవాల ప్రసాద్, మ్యాడగోని వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

కమాన్‌పూర్, ఆగస్టు 27 : జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై బయటికి రావడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ సర్పంచ్ నీలం సరిత, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు రెడ్డి రాయనర్సు, ఎలబోయిన రామ్మూర్తి, ముకీద్, సాన సురేష్‌లు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మంథని, ఆగస్టు 27: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నలుమాసు ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ ఆధ్వర్యంలో స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు క్యాంపు ఆఫీసులో మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతలు బండారి సదానందం, కావేటి సమ్మయ్య, ఎరుకల ప్రవీణ్, మంథని సురేష్, బజారు మల్లేష్, సాదుల శ్రీకాంత్, నాగుల రాజయ్య, వేల్పుల రాజు, తోకల మల్లేష్ పాల్గొన్నారు.

సమయానికి తెరుచుకోని రైతువేదిక

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 27 :మండలంలోని కొత్తపల్లిలో రైతు వేదిక కార్యాలయం మంగళవారం ఉదయం 10.30 దాటినా తెరుచు కోని పరిస్థితి నెలకొంది. దీంతో క్లస్టర్ కింద ఉన్న గ్రామాల రైతులు అక్కడికి వచ్చి పడిగాపులు కాసినా కూడా ఎవరూ రాకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. రుణమాఫీ వర్తించని రైతులంతా తమ దరఖాస్తులను సమర్పించాలంటే పెద్దపల్లికి వెళ్లి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సీజనల్ జ్వరాల కట్టడికి చర్యలు

- పరిసరాల అపరిశుభ్రత కారణంగానే విషజ్వరాలు - కలెక్టర్ కోయ శ్రీహర్ష - గుంజపడుగు, కల్వచర్ల గ్రామాల్లో పర్యటన



గుంజపడుగు గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష



కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో కిచెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథనిరూరల్, ఆగస్టు 27: గ్రామాల్లో సీజనల్ జ్వరాల వ్యాప్తి కట్టడి చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని గుంజపడుగు గ్రామంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష విస్తృతంగా పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, వైరల్ జ్వరాలకు గురైన గ్రామస్థుల ఇండ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెంది వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా లాంటి జ్వరాల వ్యాప్తికి దారి తీస్తాయన్నారు. ఇండ్ల ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. ఇండ్ల పరిసరాల్లో, రోడ్ల మీద నీరు నిల్వ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమలు నీటిలో నిల్వ ఉంటే వాటిలో అయిల్ బాల్స్ వేయాలన్నారు. గ్రామంలో రెగ్యూలర్ ఫాగ్గింగ్ చేయాలని సూచించారు. వ్యాధుల కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఆయన వెంట డీపీవో ఆశలత, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'లో రోడ్డు మరమ్మతులు

రామగిరి, ఆగస్టు 27: ఉపాధిహామీ పథకంలో రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మండలంలోని కల్వచర్ల గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాల, అధ్వానంగా మారిన రోడ్లను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి వార్డుల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్‌లకు తరలించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సరఫరాలో నాణ్యత పట్ల అప్రమత్తంగా వ్యవహరించాల్సిందిగా సూచించారు. గ్రామంలోని రోడ్ల పరిస్థితి గమనించిన కలెక్టర్ ఉపాధిహామీ ద్వారా రోడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలోని కిచెన్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం వంట చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించారు. ప్రాథమిక ప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో శైలాజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండం బల్దియాకు వీధి దీపాలు అందజేసిన ఆర్ఎఫ్‌సీఎల్

కోల్‌సిటీ, ఆగస్టు 27: రామగుండం బల్దియాలో వీధి దీపాల నిర్వహణ లేకపోవడంతో ప్రధాన రహదారులు చీకటిమయం కావడంపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవ చూపారు. మున్సిపల్ కార్పొరేషన్ వద్ద మెటీరియల్ లేకపోవడం, లైట్ల నిర్వహణ చేస్తున్న ఈఈఎస్ఎల్ చేతులెత్తడంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. మంగళవారం ఆర్ఎఫ్‌సీఎల్ అధికారుతో సమావేశం నిర్వహించారు. వీధి దీపాల నిర్వహణకు లైట్లు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనపై స్పందించిన ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం రూ.5లక్షల విలువైన ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను సమకూర్చించింది. మంగళవారం సాయంత్రం ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ రాజహంస ఆదేశాలతో ఆర్ఎఫ్‌సీఎల్ ఎలక్ట్రికల్ సీనియర్ మేనేజర్ అమోల్ సోనారే, అసిస్టెంట్ మేనేజర్(హెచ్‌ఆర్) అజయ్‌కుమార్ ఈ మెటీరియల్‌ను రామగుండం మేయర్ అనీల్ కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, ఏఈ మునీందర్, రాంజీలకు అందజేశారు. 90వాట్ల సామర్థ్యం గల 150ఎల్‌ఈడీ ఫిట్టింగ్‌లను మున్సిపల్ కార్పొరేషన్‌కు అందించారు. ఐదు సంవత్సరాల వారంటీతో ఈ లైట్లను అందించినట్టు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం పేర్కొన్నది. ఈ మెటీరియల్ అందుబాటులోకి రావడంతో మున్సిపల్ జంక్షన్ నుంచి ఫైవిక్లయిన్ వరకు సెంట్రల్ లైటింగ్ మరమ్మతులకు అవకాశం ఏర్పడింది. కాగా ఎన్‌టీపీసీ యాజమాన్యం కూడా లైట్లు సమకూర్చాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఇప్పటికే కోరారు. త్వరలో ఎన్‌టీపీసీ కూడా వీధి దీపాలకు మెటీరియల్ సమకూర్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.



మేయర్, కార్పొరేటర్లకు వీధిదీపాలను అందజేస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు

ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



తుర్కలమద్దికుంటలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 27 : ఏక కాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం మండలంలోని తుర్కలమద్దికుంటలో రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తుర్కలమద్దికుంట గ్రామస్థుల అభిప్రాయం మేరకు 33 ఫీట్ల రోడ్డు వెడల్పు నిర్మాణంలో రెండు వైపుల మురికికాలువ నిర్మాణం కోసం చర్యలు చేపట్టడం జరుగుతుందని, రోడ్డు వెడల్పులో భాగంగా ఏవైనా ఇళ్లు కోల్పోతే వారికి ప్రభుత్వపరంగా న్యాయం చేయడంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వానాకాలం పంట నుంచి రైతులకు రూ.500 రూపాయల బోనస్ ఇస్తామని, రేషన్ కార్డులు లేని వారికి కార్డులు త్వరలోనే జారీ చేస్తామన్నారు.అర్హులైన ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసి తీరుతుందని ప్రతిపక్షాలు చేసే విమర్శలను రైతుల నమ్మకూడదని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్నిచోట్ల సాంకేతిక లోపాలవల్ల, మరికొన్ని చోట్ల బ్యాంకుల తప్పిదం వల్ల రైతులకు రుణమాఫీ అందలేదని వాటన్నింటిని సవరించి పూర్తిస్థాయిలో రుణమాఫీ అందజేస్తామని రైతులు నిరాశ చెందవద్దని పేర్కొన్నారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ప్రాణాలను బలి తీసుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, ఆగస్టు 27: సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద ఆంజనేయ స్వామివారి ఆలయంలో మంగళవారం టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కన్వీనర్ మెంగని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అనంతరం గోపూజలు చేశారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ పోచాలు, సంతోష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, గొట్టం అంజయ్య, నారాయణరావు, వికాస తరంగిణి ప్రతినిదులు జలజ, సుభాషిణి, అమృత, రాధ, మానస పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్ఎంపీ, పీఎంపీల సేవలు నిలిపివేత

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27: టిఎస్ఎంసి దాడులకు నిరసనగా ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు గురువారం నుంచి గ్రామాల్లో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షులు టి శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 11 గంటలకు పెద్దపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించే వరకు నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.

'అక్రమ నిర్మాణాలను తొలగించాలి'

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27: చెరువులు, కుంటల స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విస్తరింపజేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రభుత్వానికి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణాలోని అన్ని జిల్లాలోని చెరువులు, కుంటల స్థలాలను రాజకీయ నాయకులు, బడా వ్యాపారులు, రియల్ సంస్థలు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. జిల్లాలో సైతం పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. చెరువులు, కుంటలు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేస్తు ఆక్రమిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.

పద్మశాలి ఉద్యోగులకు సన్మానం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు అందుకున్న పద్మశాలి ఉద్యోగులకు సన్మానం చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొలిపాక సారయ్య, పరికిపండ్ల కోటేశంలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపబడిన పద్మశాలీల వివరాలు ఈనెల 31లోగా అందించాలని కోరారు. వివరాల కోసం 90145350145, 9948408904 తెలుపగలరని కోరారు.

రోడ్డంతా బురదమయం

-ఇబ్బందులు పడుతున్న రైతులు

ధర్మారం, ఆగస్టు27: భారీ వర్షాల కారణంగా ధర్మారం మండల కేంద్రంలో పంట పొలాలకు వెళ్లే రోడ్లు బురదమయయ్యాయి. దీంతో వ్యవ సాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట పొలాల్లో నాటు వేసేందుకు వెళ్లే మహిళలు సైతం కాలి నడకకు ఇబ్బంది అవుతోంది. నాటు వేసే సమయంలో ఎరువులు తీసుకువెళ్లడానికి సైతం వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

డంప్ యార్డు సమస్యను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి

కమాన్‌పూర్, ఆగస్టు 27: మండల కేంద్రంలో డంప్ యార్డు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి దోమ ఆదిరెడ్డి అధికారులను సూచించారు. మంగళవారం మండల కేంద్రంని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ఎల్లవేళలా అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ విధి నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లలిత, కార్యదర్శి తిరుపతి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కమాన్‌పూర్, ఆగస్టు 27 : మండలంలోని వివిధ ప్రజా సమస్యలపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ ఆరిపోద్దీన్, ఎంపీడీవో లలితలకు వినతి పత్రం సమర్పించారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ కోఆప్షన్ పొన్నం నవీన్‌కుమార్, నాయకులు ఎల్లబోయిన రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్, సాన సురేష్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

ఖమ్మంపల్లిలో వైద్య శిబిరం

ముత్తారం, ఆగస్టు 27: ఖమ్మంపల్లిలో జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిసి మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్‌తో కలిసి వైద్యాధికారి అమరేందర్‌రావు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో విజ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలతో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందంతో పాటు అధికార యంత్రాంగానికి మాట్లాడి రోజుకు ఒక్క గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచాంచారు. మంగళవారం మొత్తం 98 మందికి పరీక్షలు నిర్వహించగా 32మంది జ్వరాలు అని చెప్పారు. మిగతా వారికి ఒళ్ళు నొప్పులు మోకాళ్ళ నొప్పులు జలుబు దగ్గు ఉన్నట్లు నిర్ధారించారు. జ్వరాలు ఉన్నవారికి 15 మందికి మలేరియా టెస్టులు, 12మందికి డెంగ్యూ టెస్టులు రాపిడ్ కిట్స్ ద్వారా చేయగా ఎవరికి కూడా పాజిటివ్ రాలేదు.

30న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ముత్తారం, ఆగస్టు 27: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించినట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు. 01-03-2023 నుంచి 31-03-2024 వరకు ముత్తారం మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద పనుల లెక్కింపులను ఈనెల 22 తేదీ నుండి 29వ తేదీ వరకు 14గ్రామాల్లో జరిపిన సామాజిక తనిఖీలలో నివేదికను తయారు చేయగా 30న ప్రజా వేదికలో ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రజా వేదికకు ప్రజలు హాజరై వారి అభిప్రాయాలను తెలపాలని కోరారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

- ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 27: సింగరేణి ఎన్నికల సందర్భంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కృషి చేస్తున్నట్టు ఐఎన్‌టీయూసీ సీనియర్ వైసఖ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఓసీపీ-1 సీహెచ్‌పీ ఆవరణలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డిపెండెంట్ అభ్యర్థుల వయస్సు ను 40 ఏళ్ళకు పెంచడం, గోదావరిఖనిలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం సాధించినట్టు తెలిపారు. సొంత ఇంటి పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని అన్నారు. మెరుగైన లాభాల వాటా సాధిస్తామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ చొరవ తీసుకోవడం లేదని, ఎల్లో రెడ్ కార్డుల విధానాన్ని రద్దు చేయించినట్టు నరసింహారెడ్డి పేర్కొన్నారు. క్యాంటీన్ల ఆధునికీకరణ, మహిళా కార్మికులకు పని స్థలాల్లో వసతుల కల్పన, కార్మికులకు రెస్ట్ షెల్టర్ల నిర్మించాలని, కార్మిక వాడల్లో ఆర్వో ప్లాంట్ల నిర్మాణం వంటి డిమాండ్లను యాజమాన్యం వద్ద ప్రస్తావించినట్టు తెలిపారు. ఈ గేట్ మీటింగ్‌లో ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, పిట్ సెక్రెటరీ కిషన్‌నాయక్, నరేష్, మల్లయ్య, సమ్మయ్య, విద్యాసాగర్, రమేష్, తిరుపతిరెడ్డి, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-3లో పర్యటించిన ఫారెస్ట్రీ ఏజీఎం



జీఎంతో సమావేశమైన ఫారెస్ట్రీ ఏజీఎం వివేక్‌బాబు

రామగిరి, ఆగస్టు 27: సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌లో కార్పొరేట్ ఫారెస్ట్రీ ఏజీఎం వివేక్‌బాబు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జీఎం సుధాకర్‌రావుతో భేటీ అయ్యారు. ఏరియాలో నిర్దేశించిన 160హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటే లక్ష్యానికి సంబంధించిన ఇప్పటివరకు వివిధ గనులు, ఓబీ డంపులపై నాటిన మొక్కలు, వాటి సంరక్షణపై చర్చించారు. అనంతరం వివిధ స్థలాల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఫారెస్ట్ అధికారి కళ్యాణ్ ఉన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 27: సింగరేణిలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐ టీయూ ఆధ్వర్యంలో ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సర లాభాలను ప్రకటించి, 35% వాటాను కార్మికులకు చెల్లించాలని, పెర్క్స్ మీట ఇన్‌కంటాక్స్‌ను రీయంబర్స్ చేయాలని, మారుపేర్ల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.నసొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్ర పరిధిలోని బొగ్గు గనులు సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై ఉన్నత స్థాయి విచారణ చేయాలని, ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సింగరేణికి విద్యుత్ సంస్థల నుండి రావాల్సిన 29 వేల కోట్ల బకాయిలను రాబట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని, ఈపీ ఆపరేటర్‌లకు రావాల్సిన ప్రమోషన్లు బ్యాక్ డేట్‌తో ఇవ్వాలని, సీఎంపీఎఫ్, పెన్షన్ లెక్కల్లో జరిగిన తప్పిదాలను సరిచేసి ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. 11వ వేజ్‌బోర్డులో వేతనం ప్రకారం పెన్షన్, గ్రాడ్యుటీ రివైజ్ చేయాలని, 190/240 మస్టర్లు పూర్తి చేసిన వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు పత్రాలు ఇచ్చే వరకు అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్, బ్రాంచి, పిట్ కమిటీల నాయకులు ఉన్నారు.



ఓసీపీ-3లో అధికారి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏఎల్‌పీని సందర్శించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారి



ఏఎల్‌పీని సందర్శించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ

రామగిరి, ఆగస్టు 27: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీని మంగళవారం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ దర్శన్ కుమార్ సోలంకి సందర్శించారు. ఈ సందర్భంగా దర్శన్‌కుమార్‌సోలంకికి జీఎం వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అడ్రియాల గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, సింగరేణి నిర్దేశిత లక్ష్యాలను వివరించారు. యంత్రాలు, భద్రతాపరమైన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం గనిలోని పని స్థలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగేశ్వర్‌రావు, రామ్మోహన్, రఘురాం, ప్రసాద్‌లు ఉన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని వినతి

రామగిరి, ఆగస్టు 27: సింగరేణి కార్మికులకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు మంగళవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు అందజేశారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజ్, లాభాల వాటా, సొంత ఇంటి కల, పెర్క్స్‌పై ఇన్‌కం ట్యాక్స్, సీఎంపీఎఫ్ వడ్డీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు కొమురయ్య, విజయ్ కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కుమార్, అహ్మద్‌పాషా, ప్రభాకర్, వేణుగోపాల్, రవికుమార్, శ్రీనివాస్, రాజబాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు